# తూచ్.. ఇంటి వద్దకు రాలేం!

- ఇకపై ఇంటి వద్దకు రేషన్ పంపిణీని నిలిపేయనున్న ప్రభుత్వం
- ఎండీయూ వాహనాలు రద్దు చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ
- ఆందోళన చెందుతున్న కార్డుదారులు.. ఎండీయూ వాహనదారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత వైఎస్సార్‌సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నీరుగార్చుతోంది. ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని నిలిపేయడమే అందుకు నిదర్శనం. ఒప్పందం పూర్తి కాకముందే ఎండీయూ వాహనాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. రేషన్ షాపుల వద్దకే వెళ్లి సరుకులు తీసుకోవాలని కార్డుదారులకు సూచించింది. దీంతో అటు కార్డుదారులు.. ఇటు ఎండీయూ వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

జూపాడుబంగ్లా: నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో 1,57,227 రేషన్ కార్డులుండగా 370 రేషన్ దుకాణాలు, 107 ఎండీయూ వాహనాలున్నాయి. కూటమి ప్రభుత్వం చర్యలతో వాహనాల దారులు వీధినపడనున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇప్పటి వరకు ఎండీయూ వాహనదారులు కార్డుదాల ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్‌సరుకులు పంపిణీ చేస్తున్నారు. 2027 వరకు వీరికి ఒప్పందం ఉంది. వాహనాల ఆపరేటింగ్ ద్వారా నెలకు ఒక్కో వాహనానికి రూ.21,000, హెల్పర్‌కు రూ.5,000 చొప్పున నిధులు మంజూరు చేస్తారు. వాహనం పెట్రోల్‌కు నెలకు రూ.2,000, బండికంతు నెలకు రూ.3,000, ఇన్సూరెన్స్ ఏడాదికి రూ.8,890 పోనూ మిగిలిన మొత్తంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈక్రమంలో జూన్ నుంచే ఎండీయూ వాహనాలను తొలగిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో వారంతా తీవ్ర ఆందోళన చెందుతన్నారు.

### కార్డుదారులకు తప్పని తిప్పలు

డీలర్లు లేని మారుమూల గ్రామాల ప్రజలు రేషన్‌సరుకుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. జూపాడుబంగ్లా మండలంలోని చాబోలు, కొత్తసిద్ధేశ్వరం గ్రామాల్లో డీలర్లు లేరు. ఆయా గ్రామాల ప్రజలు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని డీలరు వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి ఉంటుంది. కొత్తపల్లి, పాములపాడు, నందికొట్కూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మిడుతూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో కూడా డీలర్లు లేరు. ఆయా గ్రామాల్లోని ప్రజలు రేషన్‌సరుకులు పొందాలంటే పనులు మానుకొని కిలోమీటర్ల దూరంలోని ఇతర గ్రామాల రేషన్‌దుకాణాల వద్దకు వెళ్లాల్సి ఉంటుంది.

### కమీషన్ తక్కువ.. పని ఎక్కువ

ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నప్పటికీ రేషన్‌షాపుల డీలర్లకు కిలో బియ్యం పంపిణీకి రూపాయి చొప్పున కమీషన్ ఇస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో డీలర్లు సరుకులు పంపిణీ చేయకపోయినా వారికి యథావిధిగా కమీషన్ ఇస్తూ వచ్చారు. ప్రస్తుతం డీలర్లపై సరుకుల పంపిణీ భారం మోపడంతోనాటి వారికిచ్చే కమీషన్ మాత్రం పెంచకపోవటం విడ్డూరంగా ఉంది.



ఇంటి వద్దకొచ్చిన ఎండీయూ వాహనాల వద్ద రేషన్ సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు, రేషన్ పంపిణీ చేస్తున్న ఆపరేటర్(ఫైల్)

**మండలాల వారీగా రేషన్‌కార్డులు, ఎండీయూ వాహనాలు, డీలర్ల వివరాలు**

| మండలం | రేషన్ షాపులు | ఎండీయూలు | రేషన్ కార్డులు |
|---|---|---|---|
| జూపాడుబంగ్లా | 28 | 08 | 11,739 |
| కొత్తపల్లి | 31 | 07 | 9,873 |
| మిడుతూరు | 33 | 09 | 13,271 |
| నందికొట్కూరు | 48 | 17 | 25,257 |
| పగిడ్యాల | 27 | 07 | 10,709 |
| పాములపాడు | 30 | 09 | 13,244 |
| మొత్తం | 197 | 57 | 84,093 |
| శ్రీశైలం నియోజకవర్గంలో... | | | |
| ఆత్మకూరు | 57 | 17 | 23,281 |
| బండిఆత్మకూరు | 45 | 10 | 15,198 |
| మహానంది | 29 | 07 | 12,094 |
| శ్రీశైలం | 11 | 05 | 7,110 |
| వెలుగోడు | 31 | 11 | 14,451 |
| మొత్తం | 173 | 50 | 73,134 |

### ఒప్పందం పూర్తి కాలేదు



ఇంటింటికి రేషన్ సరుకుల పంపిణీకి 2027 వరకు మాకు ఒప్పందం ఉంది. అయినా నిర్దాక్షిణ్యంగా తొలగించడం ప్రభుత్వానికి తగదు. వాహనాలను తొలగిస్తే మేము కట్టిన డబ్బు, కట్టాల్సిన బండికంతులు ఎవరిస్తారు. ఉన్నఫలంగా వాహనాలను తొలగించి వీధిన పడేస్తే చూస్తూ ఊరుకోం. ఆందోళనలకు దిగుతాం.

– చెన్నయ్య, ఎండీయూ వాహనదారుల సంఘం అధ్యక్షుడు

### కమీషన్ పెంచాలి



ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసినా మాకిచ్చే కిలోకు రూ.1 కమీషన్ ఏ మాత్రం సరిపోవడం లేదు. ఇప్పుడు మాపై రేషన్‌పంపిణీ భారం అదనంగా పెట్టారు. కనీసం ప్రభుత్వం ఆలోచించి కమీషన్ అయినా పెంచాలి.

– పెద్దతిరుపాలు, డీలర్ల సంఘం అధ్యక్షుడు

### జూన్ నుంచి డీలర్ల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ



జూన్ 1 నుంచి ఎండీయూ వాహనాల ద్వారా కాకుండా డీలర్ల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ సరుకులు పంపిణీ చేస్తారు. కార్డుదారులు డీలర్ల ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. రేషన్ పంపిణీలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకొన్నా కార్డుదారులు నేరుగా నాకు పిర్యాదు చేయవచ్చు.

– చంద్రశేఖర్‌నాయక్, తహసీల్దార్, జూపాడుబంగ్లా

## క్లుప్తంగా

### దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద నెలకొని ఉన్న దత్తాత్రేయ స్వామివారికి విశేష పూజలను నిర్వహించింది. ముందుగా మహాగణపతిపూజ, తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.

### పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయం



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

మహానంది: పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయం చేకూరుతుందని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. కళాశాలలో గురువారం బలపనూరు గ్రామ ఎస్సీ మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పుట్టగొడుగులకు మంచి ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌ఏ డాక్టర్ ఎల్.విజయభాస్కర్, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఫరీదా, డాక్టర్ గురివిరెడ్డి పాల్గొన్నారు.

### రీసర్వే పకడ్బందీగా చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. గురువారం ముసలిమడుగు గ్రామ సచివాలయంలో రీ సర్వే రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే జరుగుతున్న ప్రదేశానికి సమీపంలో ఉన్న రైతులందరూ వెళ్లి అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రామసుబ్బయ్య, సర్వేర్లు పాల్గొన్నారు.

### అక్రమాలకు పాల్పడితే 6ఏ కేసులు నమోదు

పగిడ్యాల: నిత్యవసర సరుకుల పంపిణీలో డీలర్లు అక్రమాలకు పాల్పడితే 6ఏ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ శివరాముడు హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ మధుతో కలిసి ఆయన గురువారం డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసిందన్నారు. జూన్ 1 నుంచి డీలర్లే వినియోగదారులు సరుకులను పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. చౌకదుకాణం వద్ద స్టాక్ బోర్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ పాస్ మిషన్‌లోని స్టాక్, ఫిజికల్ స్టాక్‌కు వ్యత్యాసం ఉండరాదన్నారు.

### మేలు రకం విత్తనాలివ్వాలి

నందికొట్కూరు: రైతులకు మేలు రకం విత్తనాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఎంసీపీఐ (యూ) జిల్లా కన్వీనర్ లాజరస్ డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోనే రైతులకు మేలు రకం విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### జూన్ 1 నుంచి చౌకదుకాణాల్లోనే రేషన్

ఆత్మకూరు: మండలంలోని అన్ని రేషన్ దుకాణాల్లో జూన్ 1 నుంచి కార్డుదారులకు రేషన్ సరుకులు సరఫరా చేయాలని తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. గురువారం ఆమె తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ప్రతి కార్డుదారుడికి బియ్యం, చక్కెర, కందిపప్పు సక్రమంగా అందించాలన్నారు. వికలాంగులు, వృద్ధులకు మాత్రం ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులను అందించాలన్నారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గాయత్రీ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొనన్నున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠోత్సవాలు



విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసుకుంటున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని పెద్ద గుమ్మడాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు రెండవ రోజు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజ, ఆవాహిత దేవత పూజ, యంత్రాభిషేకం, మూలమంత్ర జపాదులు, హోమాధులు, నవగ్రహ పూజ, రుద్ర హోమం, దీక్ష హోమం, విగ్రహ గ్రామోత్సవం, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోష పూజ, జపహోమాలు, దాన్యాది వాసం, శయాది వాసం, పుష్పాదివాసం, ఆదివాస హోమాలు, స్వస్తి మహా మంగళహారతి, మంత్రపుష్పం వంటి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ గ్రామోత్సవంలో కళాకారులు పార్వతీ పరమేశ్వరులు, వినాయకుడి వేషధారణలతో అలరించారు.

## తర్తూరులో లఘుచండీహోమం



అర్చకులు వేదమంత్రాలు పఠిస్తుండగా లఘుమహాచండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా గురువారం లఘుచండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఈశ్వరాలయం, సవారమ్మ, చౌడమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మూర్తిహోమం, దీక్షాహోమం,మహాస్నపనం, దాన్యాధివాసం, శయ్యాధివాసం, పుష్పాధివాసం తదితర కార్యక్రమాలతో పాటు విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మహామంగళహారతినిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## శాస్త్రీయ సలహాలు పాటించాలి



రైతులకు సలహాలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

నందికొట్కూరు: రైతులు ఖరీఫ్ సీజన్‌లో శాస్త్రీయ సలహాలు పాటించాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత డాక్టర్ శ్రీనివాసులు, కేవీకే శాస్త్రవేత్తలు బాలరాజు, రవిగౌడ్ సూచించారు. గురువారం అల్లూరు, శాతనకోట, మల్యాల గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా శాస్త్రీయ సలహాలు పాటించి పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలన్నారు. భూసారా ఆధారిత ఎరువుల యాజమాన్యం, ప్రస్తుతం పంటల్లో వేయాల్సిన ఎరువుల మొతాదు ప్రకారం వేయాలని సూచించారు. మొక్కజొన్న, కంది, వరి, సోయాబీన్ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు పొందాలంటే మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు.

## ఇష్టారాజ్యంగా సైడ్‌బర్మ్ నిర్మాణం



జూపాడుబంగ్లా సమీపంలో నాసిరకంగా వేసిన సైడ్‌బర్మ్

జూపాడుబంగ్లా: రూ.1,179 కోట్లు వెచ్చించి కర్నూలు నుంచి బైర్లూటి వరకు 66 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న నేషనల్‌హైవే పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారనే విమర్శలున్నాయి. నందికొట్కూరు నుంచి జూపాడుబంగ్లా వరకు రోడ్డు వెంట నిర్మించిన సైడ్‌బర్మ్ చిన్నపాటి వర్షానికే దిగబడిపోతోంది. రోడ్డు వెంట వెళ్లే వాహనాలు ఏదైనా కారణం చేత సైడ్‌కు నిలిపేందుకు డ్రైవర్లు యత్నిస్తుండగా కూరుకుపోతున్నాయి. రోడ్డు నిర్మాణం పూర్తైన తర్వాత మీటరు మేర నాణ్యమైన గ్రావెల్‌వేసి రోలింగ్‌చేస్తూ సైడ్‌బర్మ్ నిర్మించాల్సి ఉంది. రోడ్డు నిర్మాణం పనులు దక్కించుకున్న పీఎస్‌కే కంపెనీ.. సబ్‌కాంట్రాక్టర్లకు అప్పగించడంతో వారు సైడ్‌బర్మ్‌ను నాసిరకంగా నిర్మించినట్లు ఆరోపణలున్నాయి.

## యోగాతో ఆరోగ్యం పదిలం



శిక్షణలో యోగాసనాలు వేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాములపాడు: ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా సాధన చేయడంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆయుర్వేద వైద్యాధికారిణి సావిత్రి సూచించారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో మూడో రోజు యోగా శిక్షణలో భాగంగా మాస్టర్ ట్రెనర్స్ శివప్రసాద్, మల్లేశ్వరీ పలు యోగాసనాలు వేయించి, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గాయత్రీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఆత్మకూరులో 6.6 మి.మీ. వర్షం



ఆత్మకూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలో గురువారం ఓ మోస్తారు వర్షం కురిసింది. 6.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు విత్తు వేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. ముందస్తు వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నల్లకాలువలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

ఆత్మకూరు: మండలంలోని నల్లకాలువ గ్రామంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వర్షాల కారణంగా పారిశుద్ధ్యం లోపించిన చోట పనులు చేపట్టినట్లు సర్పంచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి బాలనాయక్ తెలిపారు. మురుగును తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు తెలిపారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా చుకోవాలని సూచించారు.

### ఖాజీపేటలో చోరీ

నందికొట్కూరు: మిడుతూరు మండలం ఖాజీపేట గ్రామంలో చోరీ జరిగింది. గురువారం మిడుతూరు ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. ఖాజీపేటకు చెందిన పాణ్యం నాగలక్ష్మమ్మ ఈనెల 27న ఇంటికి తాళం వేసి నందికొట్కూరులో ఉంటున్న కొడుకు వద్దకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని నాలుగున్నర తులాల బంగారం, రూ.40 వేల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. గురువారం ఉదయం గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అలాగే కైపా సర్వోత్తమరెడ్డి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించిన దొంగలకు ఏమీ దొరక్కపోవడంతో వెనుదిరిగినట్లు సమాచారం. ఇన్‌చార్జ్ ఎస్ఐ క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాణ్యం నాగలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దార్యప్తు చేస్తునట్లు ఆయన తెలిపారు.

### ఆన్‌లైన్‌లో డీలర్ల వివరాలు



కాటాలను అప్‌డేట్ చేయిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వై.జి.శంకర్

పగిడ్యాల: వచ్చే నెల రేషన్ దుకాణాల నుంచే వినియోగదారులకు సరుకులు పంపిణీ చేయనున్న నేపథ్యంలో కమిషనర్ ఆదేశాల మేరకు కంప్యూటర్ కాటాలు, ఈ పాస్ యంత్రాల అప్‌డేట్‌తో యధాతథంగా డీలర్లు ఆన్‌లైన్ అయిపోతారని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వై.జి.శంకర్ వెల్లడించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆన్‌లైన్ ప్రక్రియను తహసీల్దార్ శివరాముడు పర్యవేక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, సీనియర్ అసిస్టెంట్ రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కమిటీ నియామకం

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కమిటీని పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నియమించారు. మున్సిపల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్లుగా సి.విజయభాస్కర్, కె.మధుసూదన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా ఎన్.కేశవులు, పి.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎం.హరి, ట్రెజరర్‌గా ఎస్.జలీల్, సెక్రటరీలుగా జేపీ రవికుమార్, ఎస్. షఫి, పింజరి బాబు, కాటేపోగు కిశోర్, మధుసూదన్‌రెడ్డితో పాటు మరో 15 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

### జూపాడుబంగ్లా మండలంలో..

వైఎస్సార్‌సీపీ జూపాడుబంగ్లా మండల కమిటీ వైస్ ప్రెసిడెంట్లుగా నక్క మల్లికార్జున, తెప్పెల్లి దినేష్, జనరల్ సెక్రటరీలుగా గుండ్రాత్తుల లక్ష్మగౌడ్, కుర్వ కృష్ణుడు, ఎన్.మధుసూదన్‌రెడ్డి, పి. నాగేశ్వరెడ్డి, సెక్రటరీలుగా ఎస్‌సీ ఎర్రన్న, వడ్ల జాకీర్ బాషా, నలమల అంకన్న, జి.జనార్దన్‌రెడ్డి, ఎం.పాండు రంగస్వామిలతో పాటు మరో 33 మందిని ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

## ట్రంప్‌కు భయపడి పాక్‌పై కాల్పులు విరమించారు

- సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీ మధు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ, సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు

పాములపాడు: ట్రంప్‌కు భయపడి పాక్‌పై మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించిందని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు విమర్శించారు. అమాయకులను పొట్టనపెట్టుకున్న ఒక్క ఉగ్రవాదిని కూడా పట్టుకోకుండానే కాల్పులను విరమించడం సిగ్గుచేటన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ వ్యాపారాలపై టారిఫ్ పన్నులు మోపుతామని ఈనెల 23న ట్రంపు హెచ్చరించడంతోనే కాల్పుల విరమణ ప్రకటన చేశారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు నిత్యం మోదీ కాళ్ల మీద పడుతుండటంతో రాష్ట్రంపై కేంద్రం పెత్తనం ఎక్కువైందన్నారు. బీజేపీ విధానాలు ప్రజా పాలనకు ఆటంకమన్నారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి పోయే గాలం దగ్గర పడిందన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించిన టీడీపీ మహానాడుకు వెళ్లిన బస్సుల్లో ఐదు, పది మందికి మించి లేరన్నారు. వారు కూడా మందు బాటిల్, బిర్యాణి పొట్లం, రూ.500 కోసం వెళ్తున్నట్లు తనతో చెప్పారన్నారు.

### 2014లో ఇచ్చిన హామీ ఏమైంది చంద్రబాబు

2014 ఆగస్టు 15న ముఖ్యమంత్రిగా కర్నూలు జాతీయ జెండావిష్కరణ చేసి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు గఫూర్ ప్రశ్నించారు. గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టుల సంగతేంటన్నారు. సూపర్‌సిక్స్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. టీడీపీ మహానాడులో మోదీ భజన చేస్తూ దేశం ఆర్థిక వ్యవస్థలో జపాన్‌ను మించిపోయిందని జబ్బలు చరుచుకున్నారన్నారు. జపాన్ తలసరి ఆదాయంతో పోల్చుకుంటే భారతదేశం 130వ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా నాయకులు ఏసురత్నం, రాజశేఖర్, రామేశ్వరరావు, మండల కార్యదర్శి స్వామన్న, నాయకులు వెంకటేశ్వరరావు, బాలయ్య, రాజు, రమణ పాల్గొన్నారు.

## మహిళా రైతులను అభివృద్ధి బాటలో నడిపించాలి

జూపాడుబంగ్లా: మహిళా రైతులను అభివృద్ధిబాటలో నడిపించాల్సిన బాధ్యత సీఆర్పీలదేనని జిల్లా ఎఫ్‌పీఓ యాంకర్ పర్సన్ సురేష్, ఆత్మకూరు, నందికొట్కూరు ఏసీలు పుల్లయ్య, అంబమ్మ సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఆర్పీలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించేలా మహిళా రైతులను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయంతో పాటు జీవాల పెంపకం, కిరాణం, టైలరింగ్ తదితర రంగాల్లో మహిళలు రాణించేలా చూడాలన్నారు. సమావేశంలో ఎఫ్‌పీఓ సీసీ కర్రెన్న, సీసీలు గాంధీ, జయలక్ష్మి, నరసింహ, బాలస్వామి, విజయభాస్కర్, అకౌంటెంట్ ఖైరూన్ పాల్గొన్నారు.

## ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళా జాతా బృందం సభ్యులు

ఆత్మకూరు: ఎయిడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళా జాతా బృందం సభ్యులు సూచించారు. గురువారం స్థానిక పాత బస్టాండు, నంద్యాల టర్నింగ్ వద్ద జంగం శంభుప్రసాద్ కళా జాతా బృందం సభ్యులు ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై వీధి నాటకం ద్వారా అవగాహన కల్పించారు.